మర్యాదపూర్వక కలయిక



ఆల్విన్‌కాలనీ: నూతనంగా ఏర్పడిన హైదర్‌నగర్ డివిజన్ మిత్రాహిల్స్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బృందం బొల్లెపల్లి సీతారామరాజు, బాలాజీ తదితరులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. రానున్న జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, రమేశ్, కరుణాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం



మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని రిటైర్డ్ కమాండెంట్ ఎస్.వి. సాంబయ్య పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్ శ్రీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎంఎంజే ఆసుపత్రి రోగులు, వారి సహాయకులకు ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదానానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దం నుంచి పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సత్యనారాయణ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రం నిర్వాహకుడి అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మెయిన్‌రోడ్డు పక్కనే వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రధాన నిర్వాహకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన దిలీప్‌సింగ్ (46) కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకాలనీ మెయిన్‌రోడ్డు పక్కన జరిగే వ్యభిచార కార్యకలాపాలకు కొంతమంది మహిళలను తీసుకువస్తున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు పోలీసులు దాడి చేసి దిలీప్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, విచారణ అనంతరం దిలీప్‌సింగ్‌ను న్యాయస్థానంలో హాజరు పరిచారు. జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

నేడు వాలీబాల్ టోర్నమెంట్, సెలక్షన్స్

కూకట్‌పల్లి: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ పోటీలు ఈనెల 13న కూకట్‌పల్లిలోని స్థానిక పాఠశాల పీఎస్‌ఎం స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు జోనల్ సెక్రటరీ బి. యాదయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ జోన్ల నుంచి అండర్-14 బాలబాలికలు, అండర్-17 బాలబాలికలు రెండు కేటగిరీలుగా పోటీలు జరుగుతాయని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9949502072 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



ముస్లింబస్తీలో ఏర్పాటు చేసిన స్తంభం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ముస్లీం బస్తీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభంతో స్థానికులు భయందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఆదివారం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీల ఆధ్వర్యంలో గ్యార్వీ షరీఫ్



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో మైనార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో షారూఖ్, ఖలీమ్, బషీర్, మహేశ్, సాయి, సందీప్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కటి స్పందన

బాలానగర్, కూకట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. పలువురు కార్పొరేటర్లు, పార్టీల నాయకులు హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావు హాస్పిటల్ శిబిరంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాశ్ ముదిరాజ్, డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి, జోన్‌బృందం



లయన్స్ టౌన్ కాలనీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది



ఎల్లమ్మబండ ప్రభుత్వాసుపత్రిలో ..



పర్వత్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో..



రాందేవ్ రావ్ హాస్పిటల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న బండి రమేశ్



కేపీహెచ్‌బీ ఆరోగ్య ఉప కేంద్రంలో ..

వైభవంగా పాండు రంగస్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవలో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

మూసాపేట: జనతానగర్‌లోని పాండు రంగస్వామి ఆలయంలో ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మూసాపేటలో నివాసముంటున్న మరాఠీలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉమాకాంత్, విశ్వనాథ్, కిషన్‌రావు, నర్సింగ్‌రావు, గోపాల్‌రావు, ఖండేరావ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వారియర్స్‌తో ఎమ్మెల్యే సమీక్ష

కూకట్‌పల్లి: వెంకట్రావునగర్ కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్‌తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ చేసిన పనులు, అదేవిధంగా నియోజకవర్గంలో పార్టీ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు ముందుకు తీసుకెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. అలాగే రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించేలా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని విమర్శలు చేసినా శాంతియుతంగా తిప్పికొట్టేలా అభివృద్ధితోనే సమాధానం చెప్పాలని, ఎక్కడా వ్యక్తిగత విమర్శలకు పోకుండా ముందుకు వెళ్లాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



దుస్తులు అందజేస్తున్న వెంకటేశ్ తదితరులు

మోతీనగర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మోతీనగర్ ఎక్స్‌టెన్షన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సీహెచ్. హనుమంతరావు పేర్కొన్నారు. మోతీనగర్ ఎక్స్‌టెన్షన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, కోశాధికారి మనీ, సంయుక్త కార్యదర్శి కిరణ్, సభ్యులు అశ్విన్, ఖాజమైనుద్దీన్, ఎంసీహెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాందేవ్‌రావ్ ఆస్పత్రిలో మెగా క్యాంపు



క్యాంప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి, వైద్యులు

కూకట్‌పల్లి: ప్రపంచ మెనోపాజ్ దినోత్సవం సందర్భంగా నేషన్స్ బెనిఫిట్స్ ఆధ్వర్యంలో రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం ఉచిత మెనోపాజ్ మెగా క్యాంప్ నిర్వహించారు. నేషన్స్ బెనిఫిట్స్ హెచ్‌ఆర్, వైస్ ప్రెసిడెంట్ విజయ శ్రీ పత్తికొండ హాజరయ్యారు. క్యాంప్‌ను లక్ష్మీ కమలాకర్ ప్రారంభించగా డా. ఛాయాదేవి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పత్తికొండ మాట్లాడుతూ.. తల్లి ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. డాక్టర్ ఛాయాదేవి క్యాంపును స్పాన్సర్ చేసిన నేషన్స్ బెనిఫిట్స్ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హాజరై మాట్లాడుతూ.. ఉమన్ ఎంపవర్‌మెంట్ కోసం హాస్పిటల్ చేస్తున్న సేవలు కొనియాడారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ.. సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి స్త్రీ మెనోపాజ్‌పై అవగాహన ఉండాలన్నారు. నేషన్స్ బెనిఫిట్స్ వారు రాందేవ్‌రావ్ ఆసుపత్రికి రూ. 5 లక్షల విరాళంగా అందించారు. ఫ్రెండ్స్ ఆఫ్ రాందేవ్ ఐటీ ప్రొఫెషన్ నేలపాలి రాజేంద్ర ప్రసాద్ పాల్గొని యోగా, ఫిజియోథెరపీ విభాగాన్ని ప్రారంభించారు. 200 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త సతీమణి సుజాత సూర్యరాజు పాల్గొని కార్యక్రమం నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుముదినీ దేవి స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ అర్చన మొరే పాల్గొన్నారు.

ఈ స్పోర్ట్ పోటీల్లో ఓరంగుటన్ టీం సత్తా



పోటీల్లో సత్తా చాటిన ఓరంగుటన్ టీం

కేపీహెచ్‌బీకాలనీ: అంతర్జాతీయ ఈ స్పోర్ట్స్ పోటీల్లో భాగంగా బాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా షో డౌన్ -2025 గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని కూకట్‌పల్లిలో ఆదివారం నిర్వహించారు. ఓరంగుటన్ టీం విజేతగా నిలిచి రూ. 30 లక్షల నగదు బహుమతి గెలుచుకుంది. అంతేగాకుండా కోటి రూపాయల బహుమతి పోటీల్లో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. అదేవిధంగా కే9 ఈస్పోర్ట్స్ టీం ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 15 లక్షలు, టీమ్ సోల్ తృతీయ స్థానంలో నిలిచి రూ. 10 లక్షల బహుమతులను గెలుచుకున్నాయి. 3 రోజులుగా దేశవ్యాప్తంగా మొబైల్ గేమ్స్‌లో పేరు పొందిన 16 టీంలు పాల్గొన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో వచ్చే నెల జరిగే పోటీల్లో కొరియా, జపాన్ తదితర దేశాలకు చెందిన ప్రముఖ టీంలతో ఫైనల్ పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ స్పోర్ట్స్, మొబైల్ గేమ్స్ సంస్థ క్రాఫ్టన్ ఇండియా సంస్థ అసోసియేషన్ డైరెక్టర్ కరణ్ పాఠక్ పోటీల వివరాలు వెల్లడించడంతో పాటు ప్రతిభ చాటిన టీంలను అభినందించారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఫైనల్స్‌లో మన దేశం నుంచి 8 టీంలు స్థానం దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పలువురు ఈ స్పోర్ట్స్ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

'అక్రమంగా తీసుకున్న అనుమతులు రద్దు చేయాలి'



పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం ఇస్తున్న ఆదిత్యనగర్ వాసులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ రోడ్డు నుంచి నాగార్జున హోమ్స్ చౌరస్తా, నిజాంపేట్ రోడ్డువరకు 60 అడుగుల రోడ్డులో భవనాల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు. కానీ వెంకట ప్రణీత్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మాత్రం వారికి 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ అని చూపించి జీ+37 ఫ్లోర్ల బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నారు. వారి వ్యాపార లబ్ధి, స్వప్రయోజనాల కోసం అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించి అక్రమ పద్ధతిలో తీసుకున్న అనుమతులు వెంటనే రద్దు చేయించాలని కోరుతూ ఆదిత్యనగర్ కాలనీవాసులు ఆదివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొడ్డి దారిన అనుమతులు తెచ్చుకుని బహుళ అంతస్తులు నిర్మిస్తున్న ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఆదిత్యనగర్, నాగార్జున హోమ్స్, పరిసర ప్రాంతవాసులు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారన్నారు. అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించి అక్రమ పద్ధతిలో తీసుకున్న అనుమతులు వెంటనే రద్దు చేయాలన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ పేర్కొన్నారు. దుబాయిగేట్ వైష్ణవిమాతా ఆలయ సమీపంలోని వైశ్య బ్యాంక్ ఎంప్లాయీస్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీలోని జీహెచ్‌ఎంసీ పార్కులో వసతులు కల్పించాలని సొసైటీ సభ్యులతో కోరారు. ఈమేరకు ఆదివారం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్ జిమ్, సీసీ కెమెరాలు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కోశాధికారి లక్ష్మణ్, కార్యదర్శి ప్రభాకర్, జీ.వి రమణ, రమా, జ్యోతి, మధుసూదన్, ప్రేంకుమార్, రామకృష్ణ, కిష్టయ్య చౌదరి నాయకులు సయ్యద్ ఏజాజ్, మైపాల్‌రెడ్డి, దామోదర్ వర్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీకి మద్దతుగా సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో శశీధర్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ, జయశంకర్ కాలనీ ఫేజ్-2లోని జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఆదివారం కాలనీలో ఓటు చోరీకి మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి. జగదీశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ దేవానాయక్, సీనియర్ నాయకులు మమమ్మద్ గఫూర్, నరేశ్, సురేశ్, రమేశ్, మహిళలు రఘు స్వరూప, మొహమ్మమద్ వహిదా, నూరాజాను, తాహెరా, జానకి, అరుణ, మొహరమ్మామ, నాగబేబీ, బుజ్జి కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



మూసాపేట: కూకట్‌పల్లిలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.97,370 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని లక్ష్మీ హాస్టల్‌లోని పెంట్ హౌస్‌లో జగద్గిరిగుట్ట, ఎర్రగడ్డ, బేగంపేట, జూబ్లీహిల్స్, బషీర్‌బాగ్, కూకట్‌పల్లి ప్రాంతాలకు చెందిన పలువురు పేకాడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు సమక్షంలో బృందం శనివారం రాత్రి 11 గంటలకు పేకాట స్థావరంపై దాడి చేసింది. వారి నుంచి 97,370 నగదు, 7 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చకచకా..

శివశక్తినగర్‌కాలనీ-మూసాపేట మెట్రోస్టేషన్ కల్వర్టు పనులు

- హైడ్రా చొరవతో నాలా ఆక్రమణల తొలగింపు
- మున్సిపల్, ఎస్‌ఎన్‌డీపీ నిధులతో నిర్మాణం
- ముంపు ప్రాంత కాలనీవాసుల హర్షం



శివశక్తినగర్ నుంచి కల్వర్టు వరకు జరుగుతున్న నాలా పనులు

మూసాపేట: మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద వర్షం పడినప్పుడల్లా పెద్ద ఎత్తున వరద ప్రవహించి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. అంతేగాకుండా ప్రగతినగర్ కాలనీ చివర వీధిలో నాలాను ఆనుకుని ఉన్న రోడ్డు, శివశక్తినగర్, శక్తినగర్, ప్రగతినగర్, శ్రీహరినగర్, హబీబ్‌నగర్ కాలనీల ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడేవారు. అయితే కొన్నేళ్లుగా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నో ప్రయత్నాలు చేసినా తాత్కాలిక పరిష్కారంగానే ఉండేది. అయితే హైడ్రా చొరవతో శాశ్వత పరిష్కారం లభించనున్నది.

అసలు సమస్య..

కూకట్‌పల్లిలోని ఐడీఎల్ (రంగధాముని) చెరువు అలుగు నుంచి వచ్చే నీరు నాలా ద్వారా హబీబ్‌నగర్, శక్తినగర్, శ్రీహరినగర్, ప్రగతినగర్, శివశక్తినగర్ కాలనీల మీదుగా మూసాపేట మెట్రో స్టేషన్ కింద నుంచి మూసాపేట శ్మశాన వాటిక వద్ద ఉన్న హుస్సేన్ సాగర్‌కు వెళ్లే నాలాలో కలుస్తుంది. అయితే నాలా ఆక్రమణలకు గురై కుచించుకు పోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నాలా ఉప్పొంగి వరద రోడ్లపైకి అపార్టుమెంట్‌లోకి వచ్చి చేరేది. వర్షాకాలంలో స్థానికులు, వాహనదారులు నాలా పూడిక తీసి నీరు వెళ్లేలా చేసేవారు. మళ్లీ వర్షాకాలానికి తిరిగి ఇదే సమస్య పునరావృత్తం కావడం పరిపాటిగా మారింది. మూసాపేట మెట్రోస్టేషన్‌కు ఆనుకుని వున్న శివశక్తి కాలనీ నుంచి వెళ్లే నాలా కేవలం మీటరున్నరకే కుచించుకుపోవడంతో పలువురు ఫిర్యాదుల మేరకు జులై 11న హైడ్రా అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య నాలా 2 కిలోమీటర్ల పొడవు ఆక్రమణలను తొలగించారు. అంతటితో ఆగకుండా మున్సిపల్ నిధులు, ఎస్‌ఎన్‌డీపీ నిధులు మంజూరు చేసి నాలాను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో ఎంత పెద్ద వర్షం వచ్చినా నీరు నాలాలోకి సాఫీగా వెళుతుంది.

నాలా అభివృద్ధికి హైడ్రా చొరవ..

శివశక్తినగర్ కాలనీ నుంచి మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద ఉన్న కల్వర్టు వరకు మున్సిపల్ నిధులతో నాలాను విస్తరిస్తున్నారు. సుమారు 94 లక్షల వ్యయంతో 4 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల ఎత్తుతో సుమారు 50 మీటర్ల పొడవు మున్సిపల్ అధికారులు పనులు చేపట్టారు. కల్వర్టు వరకు ఇంకా 20 మీటర్ల పని, మరోవైపు 4 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల ఎత్తుతో నాలా అభివృద్ధి పనులను ఎస్‌ఎన్‌డీపీ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మున్సిపల్ పనులు 2 నెలల క్రితం ప్రారంభం కాగా వేగంగా జరుగుతున్నాయి. అంతేగాకుండా ఎస్‌ఎన్‌డీపీ నిధుల కింద సుమారు రూ. 17 కోట్ల వ్యయంతో ఎస్‌ఆర్‌సీ గార్డెన్ వద్ద పనులు జరుగుతున్నాయి. అవే నిధుల నుంచి ప్రస్తుతం మున్సిపల్ అధికారులు నిర్వహిస్తున్న పనుల పక్కన మరో వైపు కల్వర్టు వరకు నిర్మించి.. కల్వర్టు నుంచి రోడ్డు మీదుగా కల్వర్టు నిర్మించి శ్మశాన వాటిక పక్కన ఉన్న నాలా వరకు పనులు చేయనున్నారు. శివశక్తినగర్ వద్ద పనులు పూర్తయితే సుమారు 8 మీటర్ల వెడల్పుతో నాలా నీరు ప్రవహించనున్నాయి. ఎస్‌ఆర్‌సీ గార్డెన్ వద్ద కూడా 7 మీటర్ల వెడల్పుతో పనులు చేస్తున్నారు. నాలా పనులు పూర్తి అయితే తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.